59

# గంగిగోవుపాలు...

మనం వంద సంవత్సరాలదాకా పోనవసరం లేదు. పాతికేళ్ల కిందటి జీవితానికీ, ఇప్పటి జీవితానికీ పోలికలు అసలే లేవని కాదుగానీ- మార్పులు కూడా చాలా ఉన్నాయి. చలపతిరావు భాషలో చెప్పాలంటే, అప్పటి మనుషుల్లో ఉన్న నిజాయితీ ఇప్పుడు కలికానిక్కూడాలేదు.

చలపతిరావు తండ్రి పేరు బసవయ్యగారు. ఆయన మోతుబరి రైతుకాదు. కానీ, తినా కుడవా ఇంత ఉన్నవారు. కాడెడ్ల వ్యవసాయం ఉన్నది. ఆయనకు రోజు గడిచే సమస్యలేదు కనుక తీరిగ్గాంత రాజకీయాల్లో దిగాడు. ముందుగా, ఊళ్ళో ఉన్న పాత కక్షల కారణంగా ఆయన ఈ ఊబిలోకి దిగాడు. తీరా దిగినాక ఇంకా కాలు తీసుకోవడానికి లేకపోయింది. నిండా మునిగినవాడికి చలి ఉండదన్న సామెత పట్ల బసవయ్యగారికి పరిపూర్ణ విశ్వాసం ఉండి వుండాలి. ఆయన కాంగ్రెసు రాజకీయాల్లో పీకలమొయ్యా దిగాడు. సభలు జరిపాడు. సమావేశాలు జరిపాడు. ఖద్దరు అమ్మాడు. కల్లుపాకల దగ్గర పికెటింగ్ చేశాడు. అయ్యదేవర కాళేశ్వరరావుగారి తోనూ, గొట్టిపాటి బ్రహ్మయ్యగారితోనూ మన బసవయ్యగారికి దగ్గర సంబంధాలుండేవి. ఈ రాజకీయాల వల్ల బసవయ్యగారు ఆర్జించిందేమీ లేదుగానీ, ఉన్న పొలం కాస్తా ఊడ్చిపెట్టుకుపోయింది. ఆయన ఇద్దరు కూతుళ్ళ పెళ్ళికీ, పెద్ద మొత్తాలు ఖర్చు చేయవలసి వచ్చింది. ఆయన దేశభక్తిగాని, ప్రభుత్వ వర్గాల్లో ఆయనకున్న పలుకుబడి గానీ, ఆయన కూతుళ్ళకు కట్నాలు ఇవ్వకుండా అడ్డు పడలేకపోయాయి.

“మా నాన్నతో పనిచేసిన వారు చాలా మంది, చాలా మంచి పదవుల్లోకి వచ్చారండీ! దేశానికి ఏం చేశారో నాకయితే తెలియదు గానీ, వారికి వారు చాలా చేసుకున్నారు. మా నాన్న మరీ నిజాయితీకి పోయాడు. ఎవర్నీ ఏదీ అడిగేవాడు కాదు. ఆయన సంపాదించలేదని నాకు బాధలేదు గానండీ - పూర్వులిచ్చిన ఆస్తిని కూడా పాడు చేసినందుకే ఒక్కోసారి మనస్సు చివుక్కుమంటుందండీ!” అన్నాడు చలపతిరావు.

“మా నాన్న చనిపోయాక మా పరిస్థితి తీన్ తేరా అయిపోయిందండీ! నా చిన్నప్పుడు మా ఇంట్లో రోజుల తరబడి ఉన్న వాళ్ళు చాలా మంది ఇప్పుడు బాగా పైకొచ్చారు. వాళ్ళెవరూ మా జోలి పట్టించుకోలేదు. మా నాన్న అడగడనుకోండి. అభిమానం చంపుకొని నేను కొందర్ని అడిగి చూశాను. ఇదిగో అని తిప్పి తిప్పి చంపేశారుగానీ, పని మాత్రం కాలేదండి. ఆఖరుకు విసుగెత్తి హోటల్లో పనిక్కుదిరాను” అన్నాడు చలపతిరావు.

ఈ పనిలో కుదరడానికి ముందు, అతను చాలా ఆలోచించాడు. ఈ పాటి పని విజయవాడలో దొరక్కపోదు. కానీ అతనికక్కడ ఉండబుద్ధికాలేదు. తన తండ్రితోపాటు చలపతిరావు కూడా విజయవాడ వీధుల్లో నినాదాలు చేస్తూ తిరిగాడు. అన్ని పార్టీల నాయకులతోనూ అతనికి పరిచయాలున్నాయి. వారందరూ ఇంకా రాజకీయాల్లోనే ఉండి ‘సేవ’ చేస్తున్నారు. చూస్తూ చూస్తూ అతను వారి కళ్ళముందే హోటల్లో పనిచేయలేక పోయాడు.

అందుకే అతను వేలికున్న ఉంగరం కాస్తా అమ్మేసి ఆ డబ్బుతో హైదరాబాదు వచ్చాడు.

హైదరాబాదు చలపతిరావుకు మరీ కొత్తకాదు. లోగడ తండ్రితో బాటు రెండు మూడు సార్లు వచ్చాడు. వచ్చినప్పుడల్లా హెూటల్లో దిగేవారు. సరిగ్గా ఆ హెూటల్లోనే చలపతి దిగారు. ఇదివరకున్న మేనేజిమెంటు మారి, కొత్తవారొచ్చారు.

“ఇదీ మంచిదే అయిందండీ! తెలిసినవారి దగ్గర పనిచేసే బాధ తప్పింది. రెండు రోజుల తరువాత అదే హెూటల్లో కుదిరాను” అన్నాడు చలపతిరావు బిక్కచచ్చిపోయిన ముఖంతో.

అతనికి హెూటలు పనితో బొత్తిగా పరిచయంలేదు. అయినా నేర్చుకున్నాడు. ఒక వరసలో ఉన్న ఆరు గదులకూ అతను సప్లయర్. వారిక్కావలసిన టిఫిన్లు, కాఫీలు, భోజనాలు, సిగరెట్లు, ఖాతాదారులు కోరినప్పుడు ‘మందు’ సరఫరా చేయడం అతని డ్యూటీలు. పేరుకు 8 గంటలన్న మాటేగానీ, 10, 12 గంటలు కూడా చేసేవాడు. మెట్లెక్కీ మెట్లుదిగీ, వొళ్ళు హూనం హూనమయిపోయేది. అయినా అతను ఆ ఉద్యోగాన్ని వదులుకోలేకపోయాడు. రెండు పూటలా భోజనం, టిఫిను, ఉండడానికి - మరో ముగ్గురితో కసి ఓగదీ- ఇంతకన్నా కావలసిందేమీ లేదనిపించింది చలపతిరావుకు.

“నా చేతుల మీదుగా కొన్ని వందల మందికి సీసాలందించాను. అప్పుడెప్పుడూ నేను బాధపడలేదు. ఏడాదికిందట ఓ సంఘటన జరిగింది. రాజమండ్రి నుండి ఇద్దరు కాంట్రాక్టర్లు వచ్చారు. వాళ్ళు గోదావరి బారేజీ పనిచేస్తున్నారనుకుంటా. వాళ్ళ బిల్లులేవో పాస్ కావాల్సి ఉంది. వచ్చారు. ఆ రాత్రి 11 గంటల దాకా తాగారు. ఏం చండాలం మాట్లాడుతున్నారో వారికే తెలీని దశ. అందులో వొకడు నన్ను ‘ఒరేయ్’ అని పిలిచాడు. పిలిచి ‘అమ్మాయికావాల’న్నాడు. అయ్యా! చెబితే మీరు నమ్మకపోవచ్చు. నన్ను నిలువునా కిరోసిన్‌పోసి కాల్చినా అంత బాధ పడకపోదును. కిక్కురుమనకుండా నా గదిలో కొచ్చి ఏడ్చేశాను. మరింక ఈ ఉద్యోగం చేయకూడదనుకొన్నాను. ఆ ఉదయమే మానేశాను” అన్నాడు చలపతిరావు చిన్న బోయిన ముఖంతో.

తరువాత అతను ఉస్మాన్‌ఖాన్ దగ్గర పనిక్కుదిరాడు. ఉస్మాన్ చిన్న రకం వ్యాపారి హెూటళ్ళతోనూ, బార్‌లతోనూ, చాలా కాలంగా అతనికి సంబంధాలున్నాయి. అక్కడ వాడి పారేసిన సీసాలను అతను చిల్లరగానూ, టోకుగానూ, బొంబాయికి ఎగుమతి చేస్తూ ఉంటాడు. ఉస్మాన్ దగ్గర ఇలా సీసాలు సేకరించేవారు పాతిక మంది దాకా ఉంటారు.

“ఈ పాతిక మందిలో నేను ఒకణ్ని నాకో సైకిలిచ్చాడు. దానిమీద ఊరంతా తిరుగుతా. ఒకటీ అరా దొరికినా కొంటా. డజన్ల లెఖ్ఖన దొరికినా కొంటా. విస్కీ, బ్రాంది, రామ్, జిన్, బీరు వగైరా సీసాలు కొంటానండి. సీసామీద లేబిల్ పోకుండా ఉంటే 5, 10 పైసలు ఎక్కువిస్తా. పై కార్కు కూడా సీసాకు వెళ్ళాడుతూ ఉంటే ఇంకో 5 పైసలు ఎక్కువిస్తా. ఎండాకలం బీరుసీసాలు బాగా దొరుకుతాయి. వాన రోజుల్లోనూ, చలి రోజుల్లోనూ బ్రాంది. రమ్, సీసాలు జాస్తిగా దొరుకుతాయి. నాకు వంద రూపాయలిస్తున్నాడు జీతం. నేను సేకరించిన సీసాల మీద నూటికి రెండు మూడు రూపాయలు కమిషన్ కూడా ఇస్తున్నాడు. నాకు తెలియదండీ! ఈ సీసాలన్నీ బొంబాయి వాళ్ళు ఏం చేసుకుంటారో నాకు తెలియదు. అధవా తెలిసినా చెప్పను. అలా చెప్పడం నాకు ధర్మం కూడా కాదు”అన్నాడు చలపతిరావు నవ్వుతూ.

అతనికింకా పెళ్ళికాలేదు. చేసుకోవాలన్న ఆలోచన కూడా లేదు అన్నాడు. ఈలైన్లో బాగా

నిలదొక్కుకోవాలని, నాలుగు రాళ్ళునిలవచేసుకొన్న తరువాత గానీ పెళ్ళి మాట తలపెట్టుకోనని అన్నాడు.

“ఈ రేకుల గదికి నెలకు ముప్పయి ఇస్తున్నాను. సొంతంగా వొండుకు తింటాను. ఎప్పుడో గానీ సినిమాలు చూడను. పత్రికలు చదువుతాను. డబ్బు నాకు చేదుకాదు. కానీ దానికోసం అంత చండాలం పనులు మాత్రం చేయలేను. ఇంతవరకూ నిజాయితీగా బతుక్కొస్తున్నాను. చూద్దాం ఇక ముందు కూడా ఇలాగనే జరుగుతుందో లేదో!” అన్నాడు చలపతిరావు తన ముందున్న సీసాల గుట్టమీదికి చూపుల్ని తిప్పుడూ.

ఈ నిజాయితీతో ఈ దగాకోరు సమాజంలో చలపతిరావు ఏం సాధించగలడన్నది ముందు ముందుగానీ మనకు తెలీదు.